# కాళేశ్వరం,పోలవరం భద్రతపై అనిశ్చితి సృష్టించిన భూకంపం

**భూకంపాలకు బాటలు వేస్తున్న భారీజలాశయాలు**

**భూమి గట్టిభాగంపై నీటిపీడన ప్రభావంతో తరుచూ ప్రకంపనలు**

**హైదరాబాద్,డిసెంబరు 4,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లా కేంద్రంకు ఈశాన్యంవైపు 50కి.మి దూరంలో భూకంపకేంద్రం ఉండటంతో తెలుగు రాష్ట్రాలలో గోదావరి నదిపై ఉన్న కాళేశ్వరం, పోలవరం ప్రాజెక్టులపై భద్రతపై అనిశ్చితి ఏర్పడింది. మేడిగడ్డ ఇప్పటికే కుంగిపోగా,పోలవరం వరుస వరదలతో కొట్టుకొని పోయిన డయాఫ్రంవాల్,తరుచూ కోతకు గురవుతున్న నదీగర్భం, రాక్‌ఫిల్ డ్యామ్ నిర్మించాల్సిన ప్రాంతంలో దెబ్బతినడం ప్రాజెక్టు నిర్మాణంలో ఇబ్బందులు పెడుతుంటే ఇప్పుడు గోదావరి బేసిన్‌లో భూకంపం రావడంతో ఈ ప్రాజెక్టుల భవిష్యత్‌పై పరివాహక ప్రాంతంలో భయాలు పెంచేస్తున్నాయి. బుధవారం ఉదయం 7.27 నిమిషాలకు భూమికంపం వచ్చింది. రిక్టర్ స్కేల్‌పై 5.0గా తీవ్రత నమోదైంది. దీనికారణంగా భూకంప కేంద్రం నుంచి 225కి.మి పరిధిలో ప్రకంపనల ప్రభావం కనిపించింది.కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్, పోలవరం నిర్మాణాల వల్ల భూపొరల్లో 40 కిమి కింద నీటిపీడన ప్రభావం ఏర్పడటం వల్ల కూడా తరుచూ భూపలకలు విరగడం వల్ల కూడా ఈ ప్రకంపనలు వచ్చే అవకాశం ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఉత్తరతెలంగాణ ప్రాంతం,కరీంనగర్,వరంగల్, ఖమ్మం,ఆదిలాబాద్ అంతేకాదు రంగారెడ్డి తదితర పూర్వజిల్లాల పరిధిలో భూప్రకంపనాలు నమోదైనాయి. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, ఏలూరు, విశాఖపట్నం వరకు భూమి కంపించింది. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగుబాటుతో ఇప్పటికే అక్కడి భూభౌతిక పరిస్థితిపై అనేక అనుమానాలు ఉన్నాయి. గోదావరి నదిలో అవక్షేపణ (సెడిమెంటేషన్) అధికమోతాదులో ఉండటంతో అక్కడ భూపొరల్లో కదలికలు కూడా ఉంటాయి.మరోవైపు సింగరేణి బొగు గనులు అండర్‌గ్రౌండ్,ఓపెన్‌కాస్టులు గనులు ఉండటంతో ఈ ప్రాంతంలోని పోలవరం, కాళేశ్వరం ప్రాజెక్టులు ఉండటంతో వాటి భవితవ్యంపై కూడా ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సింగరేణి గనులు తవ్వడం కృత్రిమ జలాశయాలు పెరిగిపోవడంతో నేల మొత్తదనం ఎక్కువై భూకంప తరంగాలు వేగంగా వ్యాపించే పరిస్థితులు భూమిలో ఏర్పడ్డాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.పోలవరం జలాశయం 118800 చ.మై. ఎపి,తెలంగాణ,చత్తీస్‌ఘడ్ ఒరిస్సా రాష్ట్రాలు పరివాహక ప్రాంతం విస్తరించి 194టిఎంసిల నీటిని నిలుపుకొనే సామర్థ్యం కలిగి ఉంటుంది.గరిష్ఠ నీటిలోతు 32.08 మీటర్లు అంటే 150అడుగుల నీటి మట్టం ఉంటుంది. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో మేడిగడ్డ, అన్నారం,సుందిళ్ళ బ్యారేజిల నుంచి 160టిఎంసిల నీటిని ఎత్తిపోయడానికి డిజైన్ చేశారు. 16.17టిఎంసిల గరిష్ఠనీటి సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు నిర్మించిన కొద్ది నెలలకే కూలడం మొదలు పెట్టింది. 2023 అక్టోబరులో ఏడవబ్లాక్ మొత్తం కుంగిపోయింది.పెద్దరిజర్వాయర్లు భూకంపాలను సృష్టించడానికి ప్రభావితం చేస్తాయని చెప్పడానికి మహారాష్ట్రలోని కొయినా ఆనకట్ట ఒక ప్రయోగశాలగా మారింది. ఆరు దశాబ్దాల క్రితం మన దేశంలో కొయినా ప్రాజెక్టు పరిసరాలలో 1967డిసెంబరు 10న భూకంపం సంభవించడంతో 200 మంది ప్రజలు చనిపోయారు వేలాది మంది గాయాలపాలైనారు 80శాతంకు పైగా ఇళ్ళు నేలమట్టమైనాయి. డ్యామ్‌కు ఐదు కిలోమిటర్ల దూరంలోనే భూకంపకేంద్రం ఉన్నది. సహజవనరులను అతిగా ధ్వంసంచేయడం, అభివృద్ధిపేరుతో ప్రకృతి విధ్వంసం చేయడం భూస్వభావం మార్పులు లోనై ఇంలాంటి పరిణామాలు ఏర్పడుతున్నాయి. భూకంపకేంద్రం ఉన్న ప్రాంతంలోనే ఆగస్టు 31న గాలిదుమారం ఆకస్మికంగా వచ్చిదాదాపు లక్షకుపైగా చెట్లు నూటాయాబై ఎకరాలలో కూలిపోయాయి. వీటికి సమీపంలో ఒకవైపు మేడిగడ్డ బ్యారేజి మరోవైపు పోలవరం డ్యామ్ ఉంది. తెలుగురాష్ట్రాలలో బుధవారం ఉదయం వచ్చిన భూప్రకంపనలపై జిఎస్ఐ సీనియర్ సైంటిస్టు గుండ రమేష్ మాట్లాడుతూ తెలంగాణలో గ్రానైట్‌పొరలతో ఉంటుందని కాళేశ్వరం పోలవరం రిజర్వాయర్ల వల్ల కలిగిన నీటి ఒత్తిడి కారణంగా భూకంపం వచ్చిందని చెప్పడానికి ఏలాంటి ఆధారాలు లేవని అభిప్రాయపడ్డారు. కృత్రిమనీటి నిల్వల జలాశయాల వల్ల 90కిపైగా భూకంప ప్రదేశాలు ప్రపంచవ్యాప్తంగా గుర్తించబడ్డాయి.

సీనియర్ సైంటిస్ బివి సుబ్బారెడ్డి భూకంపాలకు వివిధ కారణాలు ఉంటాయని కాళేశ్వరం ప్రాజెక్టు ఒక కారణమై ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిన ప్రాంతం భూకంప వైపరిత్యంకు అనుకూల ప్రదేశంగా ఉందని నీటిపీడనం ఎక్కువైతే భూకంపం వచ్చే అవకాశం ఉటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్‌జిఆర్ఐ అధికారి డాక్టర్ శేఖర్ భద్రాచలంలో 1969లో కూడా సంభవించిందని గోదావరి పరివాహక ప్రాంతంలో ఇది మాములే అని,మళ్ళీ భూకంపం వచ్చే అవకాశం ఉందని ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరంలేదని భరోసా ఇచ్చే ప్రయత్నంచేశారు. జిఎస్ఐ సీనియర్ సైంటిస్ట్ గుండ రమేష్ మాట్లాడుతూ హిమలయపర్వత ప్రాంతాల్లో నేలలో గట్టిదనం ఉండదని అక్కడ ప్రమాదకరమైన భూకంపాలు వస్తాయని ముఖ్యంగా వాయువ్య భారతంలో తీవ్రమైన భూకంపాలు వచ్చే అవకాశం ఉంటుందని లాతూరు అనుభవాలను ఆయన గుర్తుచేశారు. హిమాలయాలు అవి ఒకప్పుడు సముద్రాలని అక్కడ నేల మెత్తదనంగా ఉంటుందని జోన్-5లో ఉన్న ఏరియాల్లో తీవ్రత ఎక్కువ ఉంటుంది. 1969 జూలై 5న భద్రాచలం వద్ద రిక్టర్‌స్కేల్‌పై5.7తో అత్యధిక తీవ్రత కలిగిన భూకంపం వచ్చిందని ఆయన తెలిపారు. తెలంగాణ,ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించిన సహజ జలాశయాలు,కృత్రిమ జలాశయాలు భూకంపాల వల్ల దెబ్బతింటాయని కూలిపోతాయనే భయం వూహాజనితమని ఆయన అభిప్రాయపడ్డారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసుపై హైకోర్టును ఆశ్రయించిన హరీష్ రావు

**హైదరాబాద్, డిసెంబరు 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో తనపై నమోదైన కేసును కొట్టి వేయాలని కోరుతూ మాజీ మంత్రి హరీష్ రావు బుధవారం హైకోర్టును ఆశ్రయించారు. కాంగ్రెస్ నాయకుడు, సిద్దిపేట్‌కు చెందిన చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హరీష్ రావుతో పాటు హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్ రావుపై పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో మంగళవారం నాడు కేసు నమోదవడం విదితమే. ఈ సందర్భంగా చక్రధర్ గౌడ్ హరీష్ రావుపై తీవ్రమైన ఆ రోపణలు చేయడం విదితమే. దీనిపై హరీష్ రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తూ కేవలం రాజకీయ కారణాలతో తనపై కేసు నమోదు చేసినందున దీనిని కొట్టి వేయాలని కోరారు. హరీష్ రావు పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు దీనిపై పోలీసులకు నోటీసులు జారీ చేసింది.

# చెక్ పోస్టుల్లో ఎసిబి దాడులు: పలుచోట్ల నగదు జప్తు

**హైదరాబాద్, డిసెంబరు 4, ప్రభాతవార్త:** రాష్ట్ర సరిహద్దుల్లో గల రవాణా శాఖ చెక్‌పోస్టుల్లో ఎసిబి అధికారులు బుధవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల లెక్కలోలేని నగదు భారీగా లభించడంతో వాటిని జప్తుచేశారు. చెక్‌పోస్టుల్లో భారీగా అక్రమాలు జరుగుతున్నాయని అందిన సమాచారం మేరకు హైదరాబాద్ నుంచి ఎసిబి అధికారుల ప్రత్యేక బృందాలు ఆయా ప్రాంతాల చెక్‌పోస్టులకు ఉదయమే వెళ్లాయి. ఎసిబి అధికారులు డ్రైవర్లు, క్లీనర్ల వేషాల్లో వెళ్లడంతో చెక్‌పోస్టుల్లో వున్న సిబ్బంది వారిని గుర్తించకుండా ఎప్పటిలాగే లంచాలు డిమాండ్ చేయడం గమనార్హం. ఎసిబి అధికారులు కూడా తాము ఎవరైనదీ చెప్పకుండా సిబ్బంది కోరినట్లుగా లంచాలు ఇచ్చినట్లే ఇచ్చి ఆ తరువాత తాము ఎవరన్నదీ చెప్పడంతో అక్కడున్న వారు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఈ క్రమంలో ఆదిలాబాద్ లోని భోరజ్ చెక్‌పోస్టులో రూ.62,500లు, విష్ణుపురం చెక్‌పోస్టులో రూ.86,500లు, ఆలంపూర్ చెక్‌పోస్టులో 29,200 రూపాయలు పట్టుబడ్డాయి. ఈ మూడు చెక్‌పోస్టుల్లోవున్న రవాణా శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎసిబి అధికారులు సిఫార్సు చేయగా అనుమతి లేకుండా వున్న బయటి వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించి వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. వీటితోపాటు మరో ఏడు చెక్‌పోస్టుల్లో కూడా నగదు లభ్యమయ్యింది. ఇక్కడి సిబ్బందిపైనా చర్యలకు ఎసిబి అధికారులు ఆదేశించారు. ఎసిబి డిజిగా విజయ్ కుమార్ బాధ్యతలు చేబట్టిన తరువాత రవాణా శాఖ చెక్‌పోస్టులపై ఎసిబి దాడులు జరగడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

# బంగ్లాదేశ్ హిందువులను కాపాడే సైనిక చర్యలు చేపట్టాలి: ఎమ్మెల్యే రాజాసింగ్ విజ్ఞప్తి

**ఆ దాడులను నిరసిస్తూ, హిందువుల రక్షణకై భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో హిందూ ఐక్యవేదిక సంఘీభావ సభ**

**హైదరాబాద్ (ధర్మాచౌక్), డిసెంబరు 4, ప్రభాతవార్త:** బంగ్లాదేశ్ లోని హిందువులను కాపాడేందుకు సైనిక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే రాజాసింగ్ విజ్ఞప్తి చేశారు. బుధవారం ఇందిరా పార్క్ వద్ద బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ, హిందువుల రక్షణకై భాగ్యనగర్ గణేష్‌ఉత్సవ సమితి ఆధ్వర్యంలో హిందూ ఐక్యవేదిక సంఘీభావ సభ పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సభనుద్దేసించి రాజాసింగ్ మాట్లాడుతూ బంగ్లాదేశ్ హిందువులను చంపడానికి పెద్ద ఎత్తున పాక్ సైన్యం వెళ్లినట్లు జాతీయ మీడియా ద్వారా తెలుస్తోందని, ఇంకా నిరీక్షిస్తే అక్కడ ఒక్క హిందువు కూడా



బుధవారం జరిగిన సంఘీభావ సభలో మాట్లాడుతున్న రాజాసింగ్

మిగిలే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్ పరిస్థితుల నేపథ్యంలో ముమ్ముందు భారతదేశంలోని హిందువులు సైతం ఖచ్చితంగా మరింత పోరాట పటిమను పెంపొందించుకోవాలని సూచిం చారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి రాజ్యవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ గాంధీ, నెహ్రూ సహా ఆనాటి కాంగ్రెస్ పెద్దలు అనాలోచితంగా చేసిన నిర్ణయాలతో నేటి బంగ్లాదేశ్‌లో కానీ, నాటి పాకిస్తాన్‌లో కానీ హిందువులు, సిక్కు లు చెప్పలేని దారుణాలకు గురయ్యారని గుర్తుచేశారు. త్రిదండి దేవనాథ జీయర్‌స్వామి మాట్లాడుతూ ధర్మశాస్త్రాలు శాంతిని ప్రబోధించినప్పటికీ ఆపత్కాలంలో రక్షించుకోవల్సిన కర్తవ్యాన్ని కూడా తెలియచేశాయంటూ వివరించారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ మాధవస్వామి, శ్రీశక్తి పీఠం చెనారస్ బాబుజీ, స్వామి నారాయణ పీఠానికి చెందిన నీలకంఠ విద్యాపీఠ్ స్వామిజీ హరిదర్శన్, దుర్గానందపురి స్వామిజీ, ఆర్‌ఎస్‌ఎస్ నేత బర్ల సుందర్‌రెడ్డి, బీజేపీ కార్పోరేటర్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విశ్వేశప్రసన్నతీర్థస్వామికి పెద్దమర్యాద



**తిరుమల,డిసెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనార్థం విచ్చేసిన కర్నాటక ఉడిపి ఫెజావర్ మఠం పీఠాధిపతి విశ్వేశప్రసన్నతీర్థస్వామికి టిటిడి అధికారులు పెద్దమర్యాదతో స్వాగతం పలికారు. బుధవారం ఉదయం శిష్యులతో కలసి తిరుమలకు వచ్చిన స్వామికి బేడి ఆంజనేయస్వామి ఆలయం వద్ద టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, టిటిడి వింగ్ విఎస్ఒ ఎన్టీవీరామ్‌కుమార్, ఆలయ పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి ఆలయ సాంప్రదాయంగా స్వాగతం పలికారు. మహద్వారం నుండి ఆలయంలోనికి చేరుకున్న విశ్వేశప్రసన్నతీర్థ స్వామి తొలుత ధ్వజస్తంభానికి మొక్కారు. ఆనందనిలయంలోనికి చేరుకుని వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని కానుకలు సమర్పించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అదనపు ఇఒ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## పిఎస్ఎల్‌వి - సి 59 విజయవంతం కావాలి



**తిరుమల,డిసెంబర్ 4ప్రభాత వార్తప్రతినిధి:** శ్రీహరికోట నుండి బుధవారం ఉదయం ప్రయోగించాల్సిన పిఎస్ఎల్‌వి సి 50న రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని కోరుతూ ఇస్రో శాస్త్రవేత్తలు తిరు మలకు వచ్చారు. బుధవారం వేకువ జామున స్వామివారి సుప్రభాత సేవలో ఇస్రో ప్రతినిధులు ఆలయంలోనికి చేరుకుని నమూనా రాకెట్‌కు స్వామివారి పాదాలచెంత ఉంచి పూజలు చేశారు. శ్రీవారి ఆశీస్సు లందుకున్నామని శాస్త్రవేత్తలు విశ్వాసం వ్యక్తం చేశారు.

# రాష్ట్రం అభివృద్ధిలో ముందంజ

**ఎపి మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి**

**తిరుమల,డిసెంబర్ 4ప్రభాత వార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం, ముఖ్య మంత్రి చంద్రబాబు నాయు డు నాయకత్వంలో సుపరి పాలన దిశగా అడుగులు వేస్తోందని, అభివృద్ధిలో దేశంలో ముందంజలో ఉండా లని దేవదేవుడు శ్రీవేంకటేశ్వర స్వామిని వేడుకున్నట్లు రాష్ట్రమంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఏడుకొండల



స్వామిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. బుధవారం ఉదయం మంత్రి కుటుం బంతో కలసి ఆలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. టిటిడి అధికారులు స్వామివారితీర్థప్రసాదాలు అందజేశారు.

## పంచమిసారె ఊరేగింపునకు ఏర్పాట్లు సిద్ధం

**తిరుమల,డిసెంబర్ 4ప్రభాత వార్తప్రతినిధి:** తిరుచానూరులో కొలువైన శ్రీపద్మావతిఅమ్మవారికి జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్స వాల్లో చివరఘట్టమైన పంచమి తీర్థానికి అశేషసంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఏర్పాట్లుపై టిటిడి, పోలీసు, విజిలెన్స్ సంయుక్తంగా పర్యవే క్షించారు. తిరుమల శ్రీవారి నుండి తిరుచానూరు అమ్మవారికి సారె ఊరేగింపుగా తీసుకు రానుండటంతో ఇందుకు తిరుపతి అలిపిరి నుండి నగరంలో ఊరేగింపుగా వెళ్ళే మార్గాలను పరిశీలించారు. టిటిడి ఇఒ శ్యామలరావు, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి జెఇఒ వీరబ్రహ్మం,తిరుపతి శాంతిభద్రతల అదనపు ఎస్పీ రవిమనోహరచారి తదితరులు అన్ని ప్రాంతాలను పరిశీలించారు. శుక్రవారం (రేపు)జరిగే పంచమిని విజయవంతం చేయడంతోబాటు భక్తులకు అసౌకర్యంలేకుండా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

# ప్రజా పాలనలో పేదవాడి సొంతింటి కల సాకారం

**ఇందిరమ్మ లబ్దిదారుల ఎంపికకు రంగం సిద్ధం**

**పారదర్శక ఎంపిక కోసం మొబైల్ యాప్**

**నేడు ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి**

**6వ తేదీ నుంచి లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ**

**ప్రతీ పేదవాడికి ఇల్లు ఇస్తాం : మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్, డిసెంబరు 4, ప్రభాతవార్త :** తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపికకు రంగం సిద్ధమైంది. లబ్దిదారుల పారదర్శక ఎంపిక కోసం ప్రత్యేక మొబైల్ యాప్ సిద్ధమైంది. ఈ యాప్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి నేడు రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. రాజకీయ పార్టీలు, ప్రాంతాలు అన్న తేడా లేకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇళ్లు అందిస్తామని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. లబ్దిదారుల ఎంపిక నుంచి ఇళ్ల పంపిణీ పూర్తయ్యే వరకు సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకోవాలని అధికారులు ఇప్పటికే నిర్ణయించారు. గ్రామీణ ప్రాంత ప్రజలను దృష్టిలో పెట్టుకుని యాప్‌లో తెలుగు వర్షన్ ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నట్లు సమాచారం. ఈ మేరకు బుధవారం రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీని వాసరెడ్డి విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్రంలో నీడలేని పేదలందరికీ ఇం దిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పించిందనీ, ఈ పథకం అమలుకు ఉన్న అవరోధాలను అధిగమిస్తూ అవసరమైన కార్యాచరణను వేగవంతం చేసిందని తెలిపారు. లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా జరిగేలా ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా రాజకీయ ప్రమేయానికి తావు లేకుండా అర్హులైన వారిని ఎంపిక చేయడానికి వీలుగా మొబైల్ యాప్‌ను రూపొందించామని స్పష్టం చేశారు.

కాగా, దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం అందిస్తున్నామనీ, మహిళల పేరు మీద ఇండ్లు మంజూరు చేస్తున్నామనీ, ఈ ఇండ్లకు నాలుగు దశల్లో లబ్దిదా రులకు చెల్లింపులు చేయనున్నారు. మధ్యవర్తుల ప్రమేయానికి ఆస్కారం లేకుం డా నేరుగా లబ్దిదారుని బ్యాంకు ఖాతాలో నగదును జమ చేస్తారు. లబ్దిదారులు తమ సౌలభ్యాన్ని బట్టి 400 చదరపు అడుగులకు తగ్గకుండా ఎంత విస్తీర్ణం లోనైనా నిర్మించుకోవచ్చు. రాష్ట్రంలోని ప్రతీ మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణాలను చేపడతారు.

# హైడ్రా మరో కీలక నిర్ణయం

**ప్రతి సోమవారం ఫిర్యాదుల స్వీకరణ**

**జనవరి నుంచి అమలు చేయనున్నట్లు వెల్లడి**

**హైదరాబాద్, డిసెంబరు 4,ప్రభాతవార్త:** అక్రమ నిర్మాణాల కూల్చివేతల కోసం కాంగ్రెస్ సర్కార్ హైడ్రా తీసుకొచ్చిన విషయం తెలిసిందే. చెరువులు, ప్రభుత్వ స్థలాలు, పార్కులు, రోడ్లు, నాలాల సంరక్షణే కాకుండా విపత్తుల నిర్వహణపై కూడా హైడ్రా పనిచేస్తుంది. అయితే, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు హైడ్రా తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆక్రమణలపై ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు కొత్త ఏడాదిలో ప్రతి సోమవారం బుద్ధభవన్లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నారు.

చెరువులు, నాలాలు, పార్కుల ఆక్రమణలపై ఆర్జీలు ఇవ్వొచ్చని హైడ్రా తెలిపింది కాగా, ఇటీవల బడంగ్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని పార్కు స్థలం కబ్జా చేశారని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన వెంటనే స్పందించి పార్కు స్థలం ఆక్రమణకు గురైనట్లు తేల్చి చర్యలు చేపట్టారు. పార్కును కాపాడినందుకు కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

# తిరుమలలో ఆక్రమణలపై చైర్మన్ నాయుడు ఆగ్రహం

**నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు**



**తిరుమల,డిసెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలకొండపై దుకాణాదారులు,హోటళ్ళు,ఇతరత్రా వ్యాపారులు లైసెన్స్ పొందిన సమయంలో పేర్కొన్న నిబంధనల మేరకు వ్యాపారాలు చేసుకోవాలని, అనధికారఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని టిటిడి బోర్డు ఛైర్మన్ బిఆర్‌నాయుడు హెచ్చరించారు. కేటాయించిన స్థలం కంటే అధికంగా స్థలాలను ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్న వాటిని వెంటనే తొలగించాలని ఆయన ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించి వ్యాపారాలు చేస్తున్న వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టిటిడిలో రెవెన్యూ, పంచాయతి,విజిలెన్స్ అధికారులు తమ పనితీరును నిక్కచ్చిగా సాగించాలన్నారు. టిటిడి ఛైర్మన్ హోదాలో ఆయన తిరుమలలో పరిస్థితులు, వ్యాపారాలు, దుకాణాదారులకు లైసెన్స్‌లు, హాకర్లు అనధికార వ్యాపారాలు ఇతరత్రా వాటిపై అవగాహన కల్పించుకున్నారు.దీంతో బుధవారం మధ్యాహ్నం ఆయన రెవెన్యూ, పంచాయతి, విజిలెన్స్ అధికారులతో కలసి తిరుమలలో వరాహస్వామి విశ్రాంతి భవనం ప్రాంతం, షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో దుకాణాదారులకు కేటాయించిన స్థలం కంటే అధికంగా ఆక్రమించుకోవడం, వ్యాపారాలు చేస్తుండటంపై అసహనం వ్యక్తం చేశారు. ఇలాగే ఆక్రమణలు ఉంటే చర్యలు తప్పవని తెలిపారు. దుకాణాల లైసెన్స్‌లు, హాకరు లైసెన్స్‌లను ఆయన తనిఖీ చేశారు. టిటిడి ఎస్టేట్ అధికారి వెంకటేశ్వర్లు, విఎస్ఒ సురేంద్ర,ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తప్పుచేశా.. రీల్స్ చేయడం పొరబాటే - క్షమాపణ చెప్పిన యువతి

**తిరుమల,డిసెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి బుధవారం ఉదయం వచ్చిన పూజిత యువతి తిరుమలకు చేరుకునే ముందు అలిపిరి సప్తగిరి తనిఖీ కేంద్రానికి కొంతముందే ఓ పాటకు డాన్స్ చేసింది. ఈ డాన్స్ రీల్స్‌ను కొందరు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సామాజిక మాధ్య మాల్లో వైరల్ చేశారు. దీంతో యువతి చేసిన పాట అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద కావడంతో ఆలయ పవిత్రత, టిటిడి నిబంధనలు ఉల్లంఘిం చిందని సామాజిక మాధ్యమాల్లో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై టిటిడి విజిలెన్స్ అధికారులు కూడా యువతిపై కేసు నమోదు చేసేందుకు చర్యలకు ఉపక్రమించారు.వాతావరణానికి ఆకర్షితురాలై పాటకు రీల్స్‌డాన్స్ చేయడం జరిగిందని, అది తప్పని ఊహించలేదని వీడియో రిలీజ్ చేసింది.

# బొటానికల్ గార్డెన్‌లో కొత్తప్రాజెక్టులు





బుధవారం బొటానికల్ గార్డెన్ ఆవరణలో ఏర్పాటు చేసిన అభివృద్ధిపనులను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వర్చువల్‌గా టిజిఎఫ్‌డిసి ఆఫీసు కాంప్లెక్సులను ప్రారంభిస్తున్న దృశ్యం

**కొత్తగా వృక్షపరిచయ క్షేత్రం, వర్చువల్ సఫారీ సెంటర్ ప్రారంభం**

**పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన సీఎం రేవంత్**

**హైదరాబాద్ (గచ్చిబౌలి), డిసెంబరు 4 ప్రభాతవార్త:** ప్రజా పాలన ప్రజా విజయోత్స వాల్లో భాగంగా తెలంగాణ అటవీ అభివ ృద్ధి సంస్థ(టిజిఎఫ్‌డిసి) ఆధ్వర్యంలో కొం డాపూర్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి బొటానికల్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బుధవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి పాల్గొని పలు అభివ ృద్ధి పనులను ప్రారంభించారు. నగరంలో సుందరీకరణ, పచ్చదనం పెంపొందించి ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో బొటానికల్ గార్డెన్ ఆవరణలో పలు అత్యాధునిక హంగులతో నూతన వసతులను ఏర్పాటు చేశారు. తెలంగాణ అటవీ, దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖతో కలిసి ముఖ్యఅతిధిగా హాజరై బొటానికల్ గార్డెన్‌లో అభివ ృద్ధి చేసిన ఎకో టూరిజం, వృక్షక్షేత్రం, వర్చువల్ మోడల్ వైల్డ్‌లైఫ్ మోడల్ సఫారీ కేంద్రాలను బుధవారం ముఖ్యమంత్రి ప్రారంభించారు. దీంతో పాటు కొత్తగూడెం - పాల్వంచ, సత్తుపల్లి డివిజనల్ మేనేజర్ ఆఫీసు కాంప్లెక్సులను బొటానికల్ గార్డెన్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. దీంతో పాటు ఫారెస్ట్ ఎకో టూరిజం అభివ ృద్ధి కార్యాలయానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. గార్డెన్‌లో 75 వనాలతో నూతనంగా రూపొం దించిన వ ృక్ష పరిచయ క్షేత్రాన్ని, నూతనంగా ఏర్పాటు చేసిన వర్చువల్ వైల్డ్‌లైఫ్ సఫారీ మోడల్ కేంద్రాన్ని ప్రారంభించారు. టిజిఎఫ్‌డిసి నూతనంగా అందుబా టు లోకి తీసుకువచ్చిన వాహనాలను ప్రారంభించిన ముఖ్యమంత్రి అందులోని బ్యాటరీ వాహనంలో గార్డెన్ మొత్తం పరిశీలించి మరింత అభివ ృద్ధి చేయాలని అధికా రులకు సూచించారు. గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఫోటో ఎక్జిబిషన్‌ను తిలకించిన ముఖ్యమంత్రి, అక్కడికి వచ్చిన స్కూల్ పిల్లలతో మాట్లాడారు. ముఖ్యమంత్రి ప్రారం భోత్సవ కార్యక్రమం అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ టిజిఎఫ్‌డిసిఎల్ దేశంలోనే శాశ్వత అటవీ యాజమాన్యం, ఎకో టూరిజం రంగంలో అగ్రగామిగా ఎదిగిందన్నారు. జూలై 2024లో 32,951 హెక్టార్ల ప్రాంతానికి అంతర్జాతీయ ట్రేడ్ సర్టిఫికేట్ ఎఫ్ఎస్‌సి ఎఫ్ఎం, సిటిసిలను పొందిందని తెలిపారు. గత సంవత్సర కాలంలో టిజిఎఫ్‌డిసిఎల్ నికర లాభం 100శాతం పెరిగిందని ప్రకటించారు. 12కోట్ల రూపా యల వ్యయంతో కొత్తగూడెం, పాల్వంచ, సత్తుపల్లి, కాగజ్‌నగర్‌లలో మొత్తం 17 నూతన భవనాలను నిర్మించినట్లు తెలిపారు. బొటానికల్ గార్డెన్ ఆవరణలో నూతనంగా చేపడుతున్న గ్రీన్ బిల్డింగ్ నిర్మాణం మరో 6 నెలల్లో పూర్తవుతుందని, గార్డెన్‌కు ఉన్న నీటి సమస్యను పరిష్కరించేందుకు 5ఎంఎల్‌డి ఎస్‌టిపిని అమర్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పిఎసీ చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, వైరా ఎమ్మెల్యే రాములు నాయక్, టిఎస్‌ఎఫ్‌డిసి చైర్మన్ పోదెం వీరయ్య, ఎండి చంద్రశేఖర్‌రెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
**నీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ**
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, ఇరిగేషన్ సర్కిల్, చేవెళ్ల

**Lr No: SE/IC/Chevella/DEE-1/TS3/Advt/1375, తేది: 04.12.2024**

క్ర.సం.1, టెండర్ ప్రకటన నంబర్: **06/2024-25, తేది: 04.12.2024,** పని పేరు: వికారాబాద్ జిల్లా, తాండూరు (గ్రా) మరియు (మం) గొల్లచెరువు యొక్క ట్యాంక్ బండ్‌పై ఇతర సౌకర్యాలు మరియు విద్యుద్దీకరణ ఏర్పాటు, గ్రీనరీ యొక్క అభివృద్ధి, కల్వర్ట్‌ల నిర్మాణం, ఫీడర్ ఛానల్‌తోసహా బాక్స్ డ్రైన్ యొక్క నిర్మాణం మరియు రీ-సెక్షనింగ్, బండ్‌పై WBM రోడ్ వేయుట, ట్యాంక్ బెడ్ ఏరియాలో నీటి గుర్రపు డెక్క మొక్కల తొలగింపు, మురికినీటి డైవర్షన్ బాక్స్ డ్రైన్ యొక్క నిర్మాణం, గొల్ల చెరువు యొక్క సుందరీకరణ మరియు సంరక్షణ. **సొమ్ము లక్షలలో:** 395.36, **టెండర్ ప్రారంభ తేది:** 05.12.2024, **టెండర్ ముగింపు తేది:** 19.12.2024, **టెండర్ తెరుచు తేది:** 19.12.2024, **నెలలలో సమయ కాలం:** 12.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఇరిగేషన్ సర్కిల్, చేవెళ్ల

**DIPR.No.7450-PP/CL/Advt/1/2024-25, తేది: 04.12.2024**

**తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఒక క్రొత్త రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ కావడానికి జారీచేయబడిన నోటీసు**

**(తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము ఆదేశములతో ప్రచురించబడినది)**

**తేది: 4.12.2024**

రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ మరియు గుర్తుల కేటాయింపు ఉత్తర్వు, 2018 యొక్క నిబంధనలకు లోబడి **తెలంగాణ ప్రజా రాజ్యం పార్టీ అధ్యక్షులు అయిన శ్రీ జిలుకర రవికుమార్ గారు తమ పార్టీని 'రిజర్వు గుర్తు లేని రాజకీయ పార్టీగా'** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద నమోదు చేసుకొనుటకై అభిలషిస్తున్నట్లు సాధారణ ప్రజానీకానికి తెలియజేసేందుకు ఈ నోటీసు ఇవ్వడమైనది. ఈ పార్టీలో **(1) శ్రీ జిలుకర రవికుమార్ అధ్యక్షులు (2) శ్రీ కమ్మంపాటి శ్రీను -ప్రధాన కార్యదర్శి (3) శ్రీమతి తంగెళ్లపల్లి శ్యామల -కోశాధికారి** ప్రధాన కార్యవర్గ సభ్యులు; మరియు పార్టీ యొక్క ప్రధాన కార్యాలయము 11-21-662, ఎన్‌టిఆర్‌నగర్, ఎల్‌బి నగర్, హైదరాబాద్-74. సదరు పార్టీ రిజిస్ట్రేషనుపై ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే, అట్టి అభ్యంతరాలను కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము, మొదటి అంతస్తు, DTCP భవనము, A.C. గార్డ్స్, హైదరాబాద్-500 004 గారికి ఈ ప్రకటన ప్రచురితమైన పదిహేను రోజుల్లోగా పంపవలెను. నిర్ణీత గడువులోగా అభ్యంతరాలు రానియెడల, తెలంగాణ రాష్ట్రములో పార్టీల పరంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసేందుకు **తెలంగాణ ప్రజా రాజ్యం పార్టీ** ను ఒక రాజకీయ పార్టీగా నమోదు చేయు ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం చేపడుతుంది.

సం/-. అధ్యక్షులు సంతకం
తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ.

# హైదరాబాద్‌లో రోశయ్య విగ్రహం పెడతాం

### సిఎంలు ఎవరు ఉన్నా నంబరు 2గా రోశయ్యే

### రోశయ్య మూడో వర్ధంతి సభకు హాజరైన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,డిసెంబరు4:** దివంగత మాజీ ముఖ్యమంత్రి రోశయ్య వ్యూహాత్మక వైఖరి,ఆయనతో కలిసి పనిచేసిన చాలా మంది ముఖ్యమంత్రులకు ఉపయోగపడిందని, ప్రస్తుతం అలాంటి నాయకులు లేరని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. డాక్టర్ కొణిజేటి రోశయ్య మెమోరియల్ ఫోరం ఆధ్వర్యంలో హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్లో నిర్వహించిన రోశయ్య మూడో వర్ధంతి సభకు రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తెలంగాణ విడిపోయే నాటికి 16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌గా ఉందంటే కారణం రోశయ్యయేనని గుర్తు చేశారు. రోశయ్య ఆర్థిక సామర్థ్యంతోనే తెలంగాణ మిగులు రాష్ట్రంగా ఏర్పడిందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రశ్నించాలని, ప్రభుత్వంలో ఉన్నప్పుడు సమస్యలు పరిష్కరించాలని రోశయ్య సూచించారని చెప్పారు. మండలిలో రోశయ్యను ఎదురించి మాట్లాడేవాడిని ఆయన తన ఛాంబర్‌కు పిలిచి సలహాలు,సూచనలు ఇచ్చేవారని చెప్పారు. 2007లో శాసన మండలిలో రోశయ్య తనకు చేసిన సూచన తన ఎదుగుదలకు దోహదపడిందన్నారు. 50 ఏళ్ల ప్రజా జీవితంలో ఎన్నో పదవులకు వన్నె తెచ్చారని కొనియాడారు. ఈరోజు చట్టసభల్లో ఆయన లాంటి స్ఫూర్తి కొరవడింది. ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే పాలక పక్షానికి ఏదో పోతది అన్నట్టుగా ప్రశ్నించేవారికి మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదు. అలాంటి పరిస్థితుల నుంచి బయటపడాల్సిన అవసరముంది. తెలుసుకుని ప్రశ్నించడం ద్వారా ప్రభుత్వాన్ని ఇరుకునే పెట్టే అవకాశముందన్నారు. హైదరాబాద్‌లో రోశయ్య విగ్రహం లేకపోవడం పెద్దలోటని, వచ్చే ఏడాదిలోపు రోశయ్య విగ్రహ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ట్రబుల్ షూటర్‌గా రోశయ్య కీలక పాత్ర పోషించారు కాబట్టే, వైఎస్సార్ పని ఈజీ అయ్యిందన్నారు. 16 ఏళ్ల రోశయ్య ఆర్థిక మంత్రిగా పనిచేశారని చెప్పారు. సిఎంలు ఎవరు ఉన్నా నంబర్ 2గా రోశయ్యే ఉండేవారన్నారు. రోశయ్య ఎప్పుడు ఫైనాన్స్ వారిని దాటాలను కోలేదన్నారు. రోశయ్య తనకు పదవి కావాలని ఏనాడు అడగలేదని, రాష్ట్రం ఆర్థికంగా రాణించాలంటే ఆర్యవైశ్యుల పాత్ర కీలకమన్నారు. అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటేనే రోశయ్య ఆ స్థాయికి వెళ్లారని ఉపముఖ్యమంత్రి భట్టి అన్నారు. ప్రజా ప్రతినిధులందరూ జవాబుదారీతనంతో మెదలాలనేది రోశయ్య ఎప్పుడు చెప్పిన మాటని గుర్తు చేశారు. నమ్మిన సిద్ధాంతాల కోసం జీవించే వ్యక్తి తరాల పాటు గుర్తు ఉంటారని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.



బుధవారం రోశయ్య మూడోవర్ధంతి సభలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి తదితరులు

## సబ్సిడీల రూపంలో రూ.57వేలకోట్ల ఖర్చు

### పార్లమెంట్‌లో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్



**న్యూఢిల్లీ, డిసెంబరు 4:** భారతీయ రైల్వే ప్రయాణీకుల కోసం భారీ రాయితీని అందిస్తు న్నదని కేంద్రం ప్రతి ఏటా కోట్లాది రూపాయలు రాయితీల్లో అందిస్తున్నట్లు మంత్రి అశ్వినివైష్ణవ్ పార్లమెంటులో తెలిపారు. లోక్‌సభలో మంత్రి మాట్లాడుతూ అన్ని రకాల టికెట్లపై ప్రతి ఏటా 56,993 కోట్ల రాయితీని కేంద్రం భరిస్తోందని ప్రతి టికెట్‌పైనా ప్రతి వందరూపాయల్లో 46 రూపాయలు కేంద్రం భరిస్తున్నట్లు మంత్రి వివరించారు. అలాగే ఇపుడు అతిపెద్ద రైల్వే స్టేషన్‌ను భారత్‌లో అప్‌గ్రేడేషన్ చేస్తోందని చెప్పారు. రైల్వే కల్పిస్తున్నఈ రాయితీ సదుపాయి అన్ని కేటగిరీల ప్రయాణీకులకు వర్తిస్తుందన్నారు. ఇక రైల్వేలో వేగవంతమైన సేవలపైసభ్యుల ప్రశ్నలకు మంత్రి జవాబిచ్చారు. భుజ్ అహ్మదా బాద్‌లమధ్య ఇప్పటికే నమో భారత్‌రైలు సేవలుప్రారం భించామని కేవలం 5.45 నిమిషాల్లో గమ్యస్థానం చేరుతుందన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సుమారు 1300 రైల్వే స్టేషన్లు అప్‌గ్రేడ్ అవుతున్నట్లు తెలిపారు. క్రీడా కారులకు రైల్వేఛార్జీల్లో రాయితీని పునరుద్ధరించే యోచనపై నగేష్ బాపురావుపాటిల్ ప్రశ్నకు మంత్రి స్పందించారు. ప్రతి ప్రయాణీకుడికి సబ్సిడీనీ అందించాలని రైల్వే లక్ష్యమని అన్నారు. మహారాష్ట్ర ఎంపి ప్రణితి షిండే ప్రశ్నకు జవాబిస్తూ నిబంధన లమేరకు అన్నివర్గాలకు రాయితీలున్నాయన్నారు. మరో ఎంపి దురై వైకో సీనియర్ సిటిజన్ల రాయితీల రద్దుపై ప్రశ్నలు వేసారు.ఇందుకు సంబంధించి మంత్రి తన సమా ధానం ఇచ్చారు. ప్రయాణీకులందరూ కేంద్రం ఇచ్చే మొత్తం సబ్సిడీ కిందకు వస్తారన్నారు.



బుధవారం అన్నపూర్ణ స్టూడియోలో నాగచైతన్య-శోభిత వివాహ దృశ్యం

## అసెంబ్లీ పనితీరును విద్యార్థులకు వివరించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,డిసెంబరు4:** జవహర్ బాలమంచ్ సంస్థ ఆధ్వర్యంలో ఎడ్యుకేషన్ టూర్ లో భాగంగా హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, మంచిర్యాలకు చెందిన 120 మంది విద్యార్థిని, విద్యార్థులు తెలంగాణ అసెంబ్లీని సందర్శించారు. ఈ సందర్భంగా శాసనసభ పనితీరును విద్యార్థులకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వివరించారు. పియుసి ఛైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే కె. శంకరయ్య, లెజిస్లేచర్ సెక్రటరీ డా.వి. నరసింహా చార్యులు, బాలమంచ్ సంస్థ స్టేట్ ఛైర్మన్ రిషికేశ్ రెడ్డి, సభ్యులు సునీల్ యాదవ్ , సాయికృష్ణలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.అనంతరం స్పీకర్ ప్రసాద్ కుమార్‌తో కలిసి విద్యార్థులు గ్రూప్ ఫోటో దిగారు.



## అసెంబ్లీ,మండలి మెసెంజర్లకు నూతన ద్విచక్ర వాహనాలను అందించిన స్పీకర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,డిసెంబరు4:** శాసనసభ, శాసనమండలి మెస్సెంజర్ లకు కేటాయించిన నూతన ద్విచక్ర వాహనాలను అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పూజలు చేసి అందించారు.మెస్సెంజర్ లు శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులకు సమాచారాన్ని చేరవేయడంతో పాటుగా, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులకు శాసనసభల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు అందించడంలో సేవలు అందిస్తారు.పియుసి ఛైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే కే. శంకరయ్య, లెజిస్లేచర్ సెక్రటరీ డా. వి నరసింహా చార్యులుఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన ఎంపీజే బాలికలు

### స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించిన సొసైటీ కార్యదర్శి సైదులు

**హైదరాబాద్, డిసెంబరు 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మహాత్మా జ్యోతిరావ్ పూలే బీసీ గురుకులాల్లోని విద్యార్థులు జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థుల ప్రతిభాపాటవాలు వెలుగులోకి రావడానికి రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్ ఎంతగానో ఉపయోగపడుతుందని బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు అన్నారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా జగదేవ్‌పూర్ బాలికల స్కూల్, కాలేజ్ (పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల)లో నాలుగు రోజుల పాలు బాలికలకోసం నిర్వహించే స్పోర్ట్స్ మీట్‌ను బుధవారం ప్రారంభించారు. స్పోర్ట్స్ మీట్ లో అండర్ 14, 17, 19 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ గురుకులాల నుంచి 1400 మంది బాలికలు, 1400 మంది బాలురు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని ఆయన అన్నారు.ఎం జె పి బాలురుల కోసం అండర్ 14, 17 ,19 విభాగాల్లో ఈ నెల మూడు నుంచి ఆరో తేదీ వరకు నాలుగు రోజులపాటు జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కాలేజ్ అండ్ టెక్నాలజీ తుర్కపల్లిలో స్పోర్ట్స్‌మీట్ జరుగుతుందన్నారు. అథ్లెటిక్స్, రన్నింగ్, జంపింగ్, త్రోబాల్, కబడ్డీ,కోకో,చెస్,వాలీబాల్ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

## ఇవి విజయోత్సవాలు కాదు..వికృత ఉత్సవాలు

### కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

**హైదరాబాద్, డిసెంబరు 4 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ దృష్టిలో పిల్లలకు పురుగులు అన్నం పెట్టడం విజయం. వారి చావులు ఉత్సవాం అంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. ఈమేరకు ఎక్స్ వేదికగా పోస్టు చేశారు.

## రింగురోడ్డుపై నుండి కిందపడి కాలిపోయిన లారీ

**మేడ్చల్, డిసెంబరు 4. ప్రభాతవార్త :** ప్రమాదవశాత్తు రింగురోడ్డుపై నుండి కిందపడిన లారీ మంటల్లో కాలిపోయి, డ్రైవర్ సజీవ దహనమైన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని మియాపూర్ నుండి జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు చెత్త తీసుకెళుతున్న ఏపీ13యూక్యూ 3440 నంబరు గల పది టైర్లగల పెద్ద చెత్త వాహనం రింగురోడ్డుపై వెళుతుండగా మేడ్చల్ మండలంలోని గౌడవెల్లి గ్రామ పరిధిలో ఓఆర్ఆర్ అండర్ పాస్ వద్ద అదుపు తప్పి కింద పడిపోయింది. దీంతో వాహనంలో మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోగా అందులో ఉన్న లారీ డ్రైవర్ పినబోయిన సందీప్ (25) వహనంలోనె చిక్కుకుని సజీవ దహనమయ్యాడు. మృతుడు సందీప్ భద్రాచలం ఇల్లందుకు చెందిన వాడు కాగా కీసర మండలం నాగారాం మున్సిపల్ పరిధి రాంపల్లిలో నివాసముంటూ లారీ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# పర్యాటకానికి 'జలసత్వం'

### జల పర్యాటక, సాహస క్రీడలకు ప్రాధాన్యం

### హుస్సేన్‌సాగర్ వాటర్ స్పోర్ట్స్‌ను లాంఛనంగా ప్రారంభించిన మంత్రి జూపల్లి

**హైదరాబాద్, డిసెంబరు4, ప్రభాతవార్త :** రాష్ట్రంలో పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు జల పర్యాటకం, సాహస క్రీడలకు సరికొత్త రూపు సంతరించుకునే దిశగా సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నదని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. జల పర్యాటకం అభివృద్ధిలో భాగంగా హుస్సేన్ సాగర్‌లో అమరావతి బోటింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ స్పోర్ట్స్‌ను మంత్రి జూపల్లి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డితో కలసి జెట్ స్కైపై కాసేపు విహరించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ రాష్ట్రంలోని అందమైన పర్యాటక ప్రాంతాలు, పురాతన, చారిత్రక ప్రాంతాలతో పాటు టెంపుల్ టూరిజం, జల, సాహస క్రీడల టూరిజానికి అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. ఇటీవలి కాలంలో వాటర్ స్పోర్ట్స్ విపరీతమైన ప్రజాదరణ పొందుతున్నాయనీ, దీన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో జల పర్యాటకాన్ని ప్రోత్సహించడంతో పాటు జల విహార అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నీటి వనరులను పరిశీలించి పర్యాటక అభివృద్ధికి అనుకూలమైన ప్రాంతాలను గుర్తించే పనిలో ఉన్నామని చెప్పారు. అంతర్జాతీయ ప్రాముఖ్యత వచ్చేలా కృష్ణా నది పరివాహక ప్రాంతంలోని సోమశిల బ్యాక్ వాటర్, నాగార్జునసాగర్, ఇతర రిజర్వాయర్లు హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్ తదితర ప్రాంతాలను తీర్చిదిద్దితే రాష్ట్రంలో జల పర్యాటకం గణనీయంగా అభివృద్ధి చెందుతుందని వివరించారు. పర్యాటక అభివృద్ధి సంస్థ వల్ల స్థానికులకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు రాష్ట్ర ఆదాయం పెరుగుతుందని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి దాన్ని అమలు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వానికి వ్యాపారాత్మక ధోరణి లేదనీ, నిరుపయోగంగా ఉన్న వాటిని పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు పీపీపీ మోడల్‌లో మౌలిక వసతులు కల్పిస్తామని అన్నారు. హుస్సేన్ సాగర్‌లో పెద్దలు పిల్లలు కలిసి వాటర్ స్పోర్ట్స్ ఎంజాయ్ చేసే విధంగా జెట్‌స్కై, కయక్, జెట్ అటాక్, వాటర్ రోలర్‌ను పర్యాటకులకు అందుబాటులోకి తెచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి, అమరావతి బోటింగ్ క్లబ్ సీఈవో తరుణ్ కాకాని తదితరులు పాల్గొన్నారు.



## సుఖ్‌బీర్‌సింగ్‌బాదల్‌పై కాల్పులు!

### అప్రమత్తం అయి పట్టుకున్న భద్రతా సిబ్బంది

### సేవాదార్ శిక్షకొనసాగిస్తున్న రణ్‌బీర్‌పై సమీపం నుంచి కాల్పులు



**అమృత్‌సర్, డిసెంబరు 4:** పంజాబ్‌లోని అమృత్‌సర్ స్వర్ణదేవాలయం ఆవరణలో కాల్పులు కలకలం రేపాయి. పంజాబ్‌మాజీ ఉప ముఖ్యమంత్రి శిరోమణి అకాలిదళ్‌పార్టీ నేత సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై ఆగంతకుడు ఒకరు కాల్పులుజరిపారు. ఆయన సేవాదాంగా శిక్షను కొనసాగిస్తుండగా ఈఘటన జరిగింది. స్వర్ణదేవాలయ ప్రవేశద్వారంవద్ద సుఖ్‌బీర్ చక్రాల కుర్చీపై సేవాదార్‌గా ఉండగా ఒక వృద్ధుడు ఆయనను సమీపించాడు. కొన్ని అడుగుల దూరంలోనే ఉనన ఆతడు ప్యాంట్ జేబులోంచి తుపాకీ తీసి సుఖ్‌బీర్‌పైకి కాల్పులుజరిపాడు. సుఖ్‌బీర్ వ్యక్తిగత సిబ్బంది వెంటనే ఆ వృద్ధుడిని అడ్డుకుని పక్కకు లాగేసి తర్వాత పోలీసులకు అప్పగించారు. కాల్పుల ఘటన అనంతరం కూడా సుఖ్‌బీర్ తన శిక్షను కొనసాగించారు. సతీమణి హర్‌సిమ్రత్‌కౌర్ బాదల్‌తో కలిసి స్వర్ణదే వాలయంలో వంటపాత్రలు శుభ్రంచేసారు. నిందితుడు నరౌన్‌సింగ్‌చౌరా అని గుర్తించారు.

## పవర్ గ్రిడ్ సదరన్ రీజియన్ ఇడిగా నాగరాజు బాధ్యతల స్వీకరణ

**హైదరాబాద్, డిసెంబరు 4, ప్రభాతవార్త:** పవర్ గ్రిడ్, సదరన్ రీజియన్ ట్రాన్స్ మిషన్ ఎగ్జిక్యూటివ్ డైరక్టరుగా ఎ నాగరాజును కేంద్రం నియమించింది. ఈ సదరన్ రీజియన్ పరిధిలోలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని సబ్ స్టేష న్లతో పాటు, కర్నాటకలోని కొంతభాగం ఉంది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని పవర్ గ్రిడ్ సదరన్ రీజియన్‌కార్యాలయంలో ఆయన బాధ్యతలను స్వీకరించారు. నాగరాజు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో గ్రాడ్యుయేట్ చేశారు. 1986లో ఎన్టీపీసీలో ఇంజనీర్ ట్రైనిగా అతని వృత్తి ప్రారంభం అయిన తదుపరి, 1991లో పవర్ గ్రిడ్‌లో ఇంజనీర్‌గా చేరారు. 38 సంవత్సరాల కంటే ఎక్కువ అనుభాన్ని కలిగిన నాగరాజు ట్రాన్స్మిషన్ విభాగంలో పనిచేశారు. ప్రాజెక్టు నిర్వహణ, ఒప్పందాలు, వాణిజ్య, పర్యావ రణం, సామాజిక నిర్వహణ తదితర విభాగాలతో పాటు, హైదరాబాద్, నాగ పూర్, బెంగుళూరు వంటి కార్పొరేట్ సెంటర్లలో బాధ్యతలు నిర్వర్తించారు. అలాగే గురుగ్రామ్‌లోని కార్పొరేట్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ డైరక్టర్‌గా పనిచేశారు.



# ఆలయాలను తీర్చిదిద్దుతున్నాం

### వచ్చే బ్రహ్మోత్సవాలలోగా యాదాద్రి విమాన గోపురం స్వర్ణ తాపడం పనులు పూర్తి

### 33 మంది జూనియర్ అసిస్టెంట్లకు ఇఒలుగా పదోన్నతి

### దేవాదాయ శాఖ వార్షిక ప్రగతి నివేదికలో మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్, డిసెంబరు 4, ప్రభాతవార్త :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సామాన్య భక్తులను దృష్టిలో పెట్టుకుని అద్భుతంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ముఖ్యంగా దేవాలయాల్లో కనీస సౌకర్యాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిందని వెల్లడించారు. డిసెంబర్ 1 నుంచి 9 వరకు నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ సాధించిన ప్రగతి వార్షిక నివేదికను మంత్రి సురేఖ బుధవారం హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్, ఆర్జేసి రామకృష్ణారావు, అడిషనల్ కమిషనర్లు జ్యోతి, కృష్ణవేణి, ఏసిలు అంబుజ, లావణ్య, అంజనారెడ్డి, రామాంజనేయులు, సంధ్యారాణి, బాలాజి, రాష్ట్ర ఈవోల సంఘం అధ్యక్షుడు నరేందర్, ఆలయ ఈవో శ్రీనివాసశర్మ, టెంపుల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ సంవత్సర కాలంలో దేవాలయాల్లో పేరుకుపోయిన పెండింగ్ పనులను పూర్తి చేస్తూ దేవాలయాల అభివృద్ధికి నిబద్ధతతో పని చేస్తున్నామని చెప్పారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న 33 మంది జూనియర్ అసిస్టెంట్లకు గ్రేడ్ 3 ఈవోలుగా పదోన్నతి కల్పించి వారి కలను నిజం చేసిందనీ, అంతేకాకుండా 16 సంవత్సరాల సుదీర్ఘ కాలం తరువాత ఆలయ ఉద్యోగులు అందరికీ బదిలీలు చేపట్టడంతో పాటు ప్రమోషన్లు కల్పించామని స్పష్టం చేశారు. అలాగే, దాదాపు రూ.400 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని ప్రముఖ దేవాల యాలతోపాటు ఇతర దేవాలయాల్లో అభివృద్ధి పనులకు చర్యలు చేపడుతు న్నామన్నారు. వచ్చే బ్రహ్మోతవాల వరకు యాదగిరిగుట్ట దేవాలయ విమాన గోపురం పనులు పూర్తి చేస్తామనీ, దేశంలోనే ఎత్తయిన స్వర్ణ గోపురంగా ఈ దేవాలయం ఖ్యాతిగాంచనుందని చెప్పారు. అలాగే, భద్రాచలం, వేములవాడ దేవాలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌లతో కట్టుదిట్టంగా ముందుకు పోతున్నట్లు తెలిపారు. భక్తుల నమ్మకాలు, విశ్వాసాలకు అనుగుణంగా ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లేలా దేవాలయాలను తీర్చిది ద్దుతామని ఈ సందర్భంగా మంత్రి సురేఖ వెల్లడించారు.

## సచివాలయంలో 44 మంది అసిస్టెంట్ సెక్రటరీల బదిలీ

**హైదరాబాద్, డిసెంబరు 4, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర సచివాలయం జనరల్ అడ్మినిస్టేషన్ డిపార్ట్మెంట్ (జిఎండి) లోని అసిస్టెంట్ సెక్రటరీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఈ అసిస్టెంట్ సెక్రటరీలను సింగిల్ యూనిట్ క్రింద బదిలీ చేస్తునట్లు సీఎస్ శాంతి కుమారి ఉత్తర్వులు జారి చేశారు. దీంతో ఈ 44 మంది అసిస్టెంట్ సెక్రటరీలు వివిధ శాఖలకు బదిలీ అయ్యారు. వారిని వెంటనే విధుల్లో చేరాలని, బదిలీ కాబడిన విభాగాలలో రిపోర్టు చేయాలని ఉత్తర్వులలో చీఫ్ సెక్రటరీ పేర్కొన్నారు.

## రూ.210 కోట్లతో ఇండో-యుఎస్ స్టార్టప్ ఇన్నోవేషన్‌ను అబిరో క్యాపిటల్ ప్రోత్సాహం

**హైదరాబాద్, డిసెంబరు 4 ప్రభాతవార్త:** ఇండో-యుఎస్ వెంచర్ క్యాపిటల్ సంస్థ అబిరో క్యాపిటల్, ట్రాన్స్‌ఫార్మేటివ్ టెక్నాలజీ స్టార్టప్‌లను ప్రోత్సహించే లక్ష్యంతో 25 మిలియన్ (210 కోట్లు)తో ఫండ్‌ను ప్రారంభించింది. ప్రపంచ సవాళ్లను పరిష్కరించడంపై దృష్టి సారించిన ఈ ఫండ్ ఏఐ, జెన్ ఏఐ, ఈఆర్పి సాస్, హెల్త్‌కేర్, ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్, తయారీ, సరఫరా గొలుసు, డెలివరీ వంటి అత్యాధునిక రంగాలలో స్టార్టప్‌లలో పెట్టుబడి పెట్టనుంది. రాబోయే నాలుగు సంవత్సరాల్లో, పేషెంట్ క్యాపిటల్, కార్యాచరణ నైపుణ్యం, గ్లోబల్ నెట్‌వర్క్‌లకు యాక్సెస్‌తో 12 నుంచి 15 స్టార్టప్‌లను బ్యాకప్ చేయాలని అబిరో క్యాపిటల్ లక్ష్యంగా పెట్టుకుంది. అబిరో క్యాపిటల్ వ్యవస్థాపకుడు వంశీ కోరాకు మాట్లాడుతూ "సాధికారత కలిగిన బృందాలు, క్రమశిక్షణతో కూడిన అమలు విజయానికి కీలకమని తాము నమ్ముతున్నామని అన్నారు. అబిరో క్యాపిటల్ సలహాదారు, టిహబ్ మాజీ సిఈఓ మహంకాళి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ "స్టార్టప్‌లు నిధులకు మించిన సవాళ్లను ఎదుర్కొంటున్నాయన్నారు. టిహబ్ తాత్కాలిక సిఈఓ సుజిత్ జాగిర్దార్ మాట్లాడుతూ అబిరో క్యాపిటల్‌తో ఈ సహకారం రూపాంతర సవాళ్లను ఎదుర్కోవడంలో స్టార్టప్‌లను శక్తివంతం చేయడానికి మాభాగస్వామ్య దృష్టిని ప్రతిబింబిస్తుందన్నారు. టిహబ్‌లో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఒలింపిక్ పతక విజేత పి.వి.సింధులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపాల్ పదోన్నతులకు జేఎల్స్ సీనియారిటీ లిస్టు

### త్వరగా ఇవ్వాలని ఇంటర్ విద్య కమిషనర్ ఆదేశాలు

**హైదరాబాద్, డిసెంబరు 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుతన జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న జూనియర్ లెక్చరర్లలో సీనియారిటీ లిస్టును ఇవ్వాలని ఇంటర్ విద్య కమిషనర్ ఆర్‌జేడీ వరంగల్‌ను ఆదేశించారు. రాష్ట్రంలో సుమారు 68 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో రెగ్యులర్ ప్రిన్సిపాల్స్ లేరు. దీంతో సీనియర్ జేఎల్స్‌కి ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతులు కల్పించాలని ఇంటర్ విద్య కమిషనర్ భావించారు. ఈ నేపథ్యంలో పదోన్నతుల కోసం సీనియారిటీ ప్రకారం జేఎల్స్ లిస్టును వెంటనే సమర్పించాలని ఆదేశించారు. రాష్ట్రంలో 424 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు కొనసాగుతున్నాయి.

# 7, 8, 9 తేదీలలో ఘనంగా ప్రజాపాలన విజయోత్సవాలు

### 9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ చేయనున్న సిఎం

### భారీ డ్రోన్ షో థమన్, రాహుల్ సిప్లిగంజ్, వందేమాతరంచే మ్యూజికల్ కాన్సర్ట్

**హైదరాబాద్, డిసెంబరు 4 ప్రభాతవార్త:** ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా ఈ నెల 7,8,9 తేదీలలో జరిగే ముగింపు వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవాల ముగింపు వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై బుధవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, జిఏడి ముఖ్య కార్యదర్శి రఘునందన్‌రావులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, ఉత్సవాల చివరి మూడు రోజుల్లో సచివాలయ ప్రాంగణంలో ముఖ్యమంత్రి తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ తోపాటు మూడు రోజుల పాటు సిని రంగ ప్రముఖులచే మ్యూజికల్ నైట్, నగరంలోని ప్రముఖ హోటళ్లు, డ్వాక్రా, రెస్టారెంట్లు, సంస్థలచే స్టాళ్ళ ఏర్పాటు, భారీ ఎత్తున డ్రోన్ షో, లేజర్ షో, క్రాకర్స్ షో తదితర కార్యక్రమాలుంటాయని తెలిపారు. డిసెంబర్ 7వ వందేమాతరం శ్రీనివాస్ బృందం, 8వ తేదీన రాహుల్ సిప్లిగంజ్, 9వ తేదీన థమన్‌చే సినీ సాంస్కృతిక కార్యక్రమాలుంటాయని తెలిపారు. ఈ సమావేశంలో, పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సభర్వాల్, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి బుద్ధ ప్రకాష్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, జలమండలి ఎం.డి అశోక్ రెడ్డి, జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి, సంజయ్ కుమార్ జైన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎఎన్ఎం పరీక్షకు అర్హత లేని వారికి గ్రాఫ్ శాలరీ ఇవ్వాలి: ఏఐటీయూసి విజ్ఞప్తి

**హైదరాబాద్, డిసెంబరు 4, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఏఎన్ఎం పోస్టుల సంఖ్యను పెంచాలనీ, పరీక్షకు అర్హత లేని వారికి 100 శాతం గ్రాఫ్ శాలరీ ఇవ్వాలని ఏఐటియూసి విజ్ఞప్తి చేసింది. బుధవారం రెండో ఏఎన్ఎంల సమస్యల పరిష్కారానికి ఏర్పడ్డ కమిటీకి ఏఐటీయూసీ నేతలు ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, రెండో ఏఎన్ఎంల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పద్మ, కోశాధికారి రాజేశ్వరి, స్వర్ణలత వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు కమిటీ చైర్మన్ కె.హైమావతి, మెంబర్ రవీందర్ నాయక్‌లతో మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా రెండవ ఏఎన్ఎంలు విధులు నిర్వర్తిస్తున్నారనీ నోటిఫికేషన్ ప్రకారం పోస్టుల సంఖ్యను పెంచాలనీ, పరీక్షకు అర్హత లేని వారికి 100 శాతం గ్రాఫ్ శాలరీ ఇవ్వాలనీ, ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలనీ, పరీక్షలకు ప్రిపరేషన్ అయ్యేందుకు ఒక నెల వేతనంతో కూడిన సెలవు అమలు చేయాలనీ, వారు కమిటీకి విన్నవించారు. రాష్ట్రంలో పేద ప్రజలకు వైద్య, ఆరోగ్య సేవలు అందించడంలో రెండో ఏఎన్ఎంల పాత్ర కీలకంగా ఉందనీ, వారి సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం వారికి న్యాయం చేయాలని వారు కమిటీకి విజ్ఞప్తి చేశారు. యూనియన్ ప్రతినిధులు తెలియజేసి సమస్యలను సానుకూలంగా స్పందించిన కమిటీ సభ్యులు తప్పకుండా రెండో ఏన్ఎంల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## హైదరాబాద్‌లో 'పుష్ప' హడావుడి

### నటుడు అల్లు అర్జున్‌ను చూసేందుకు థియేటర్ వద్ద ఎగబడిన ప్రేక్షకులు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), డిసెంబరు 4 ప్రభాతవార్త:** పుష్ప2 చిత్రంలో హీరోగా నటించిన సినీ నటుడు అల్లు అర్జున్ బుధవారం రాత్రి ఆర్టీసీ క్రాస్ రోడ్ సంధ్య థియేటర్లో చిత్రం ప్రీమియర్ షోను వీక్షించాడు. భారీ అంచనాలు నెలకొన్న పుష్పటు డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వంలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన ఈ భారీ యాక్షన్ చిత్రం ప్రపంచవ్యాప్తంగా గురువారం విడుదలవుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే రిలీజ్ అయిన ట్రైలర్, పాటలు సామాజిక మాధ్య మాల్లో విషయంగా స్పందన లభిస్తుంది. అల్లు అర్జున్ థియేటర్‌కి వచ్చిన విషయం తెలుసుకున్న ఆయన అభిమానులు పెద్ద ఎత్తున అక్కడ చేరుకొని తమ అభిమానాన్ని చాటుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా పుష్ప2 హంగామా మొదలైంది. పుష్ప2 ప్రిమియర్ షో కోసం బన్నీ సంధ్యథియేటర్‌కు వచ్చారు. అభిమానులతో కలిసి పుష్ప2 చిత్రాన్ని బన్నీ వీక్షి ంచనున్నారు.అల్లుఅర్జున్ రాకతో ఆర్టీసీ క్రాస్ రోడ్డుకు అభిమా నులు భారీగా చేరుకున్నారు.

